క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయంలో స్పందన



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అధికారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పట్టణ ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొని అర్జీలు స్వీకరించారు. కల్లుబావి వీధికి చెందిన లక్ష్మి బీమా సొమ్ము రాలేదని, మట్కర్ వాడికి చెందిన ముక్త రామ తమ పిల్లలకు అమ్మ ఒడి అందలేదని అర్జీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కరించాలని చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: ఆదోని మండలవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు కేటాయించాలని, సన్న బియ్యం పంపిణీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదోని యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భరత్, శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహించాలని కోరారు.

సీపీఎస్ రద్దు చేయాలి



ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ మండల నాయకులు

కోసిగి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గురుస్వామి, మండల గౌరవాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, అధ్యక్షుడు భీంరెడ్డి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ రుద్రగౌడ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ మండల శాఖ సమక్షంలో ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ నాయకులు రాముడు, రామకృష్ణా రెడ్డి, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

ఆదోని అర్బన్: ఆదోని తిరుమల నగర్ ఇంజినీరింగ్ కాలనీ వివేకానంద యోగా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆయుర్వేద డాక్టర్ కౌశిక్ సోమిశెట్టి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, యోగాసనాల ద్వారా ఆరోగ్యం తదితర అంశాలపై ఐదు రోజులుగా ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. పలు ఆరోగ్య సమస్యలకు సలహాలు, సూచనలు తెలియజేశారు. ప్రతిఒక్కరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉంటుందని, చిన్నచిన్న సూచనల ద్వారా డాక్టర్ అవసరం లేకుండా మనిషి జీవన విధానాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. వివేకానంద యోగా శిక్షణ సంస్థ సభ్యులు విశ్వనాథ్, కొల్లి శ్రీధర భీమన్నగౌడ్, సహకరి మల్లికార్జున, యోగా ట్రైనర్ సురేష్ తదితరులు ఘనంగా సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని అర్బన్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) కేంద్రంలో పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం సమన్వయకర్త ఎ.సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు జనవరి 31వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సర్టిఫికెట్ (కేఫ్), బీఏ, బీకాం కోర్సులకు ఫీజు పూర్తి మినహాయింపు ఉంటుందని వెల్లడించారు.

ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

కర్నూలు (టౌన్): నేటి నుంచి ఆర్టీసీ బస్సులను దారి మళ్లిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సోమవారం తెలిపారు. నగరానికి వచ్చే బస్సులు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు. బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు హైవే మీదుగానే రాకపోకలు సాగించనున్నాయి. నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం, బనగానపల్లె తదితర ప్రాంతాల వైపుగా వెళ్లే బస్సులు కర్నూలు బస్టాండ్ నుంచి గుత్తి పెట్రోల్ బంకు మీదుగా వచ్చి సి.క్యాంపు సెంటర్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్తాయి. డోన్, అనంతపురం వైపు వెళ్లే బస్సులు హైవే మీదుగానే ప్రయాణం సాగిస్తాయి. నగరంలో రద్దీ పెరగడంతో పాటు గత కొంతకాలంగా ఆర్టీసీ బస్సుల కారణంగా చోటు చేసుకుంటున్న ప్రమాదాలను పరిగణలోకి తీసుకొని కలెక్టర్ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ తెలిపారు. నందికొట్కూర్, నంద్యాల వైపు వెళ్లే పెద్ద ఆటోలను కూడా నగరంలోకి రాకుండా నిషేధించినట్లు వెల్లడించారు.

కొత్త ఏడాది పింఛను కానుక

కోసిగి: కొత్త ఏడాదిలో అర్హత సాధించిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఊరూరా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సోమవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఈరన్న కోసిగిలోని 4వ వార్డులో, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ కందుకూరు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. దుద్ది గ్రామ సచివాలయ పరిధిలో దుద్ది నాగేష్, రామలింగ, చిర్తనకల్లు గ్రామంలో సర్పంచ్ ఈరన్న చేతుల మీదుగా, పెద్దభూంపల్లి గ్రామంలో గట్టు భీమయ్య సమక్షంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా పింఛను సొమ్ము పెంచుతున్నారని, మూడవ సారి న్యూ ఇయర్ కానుకగా మరో రూ.250 పెంచి ప్రస్తుతం రూ.2,750 నగదు అందిస్తున్నారన్నారు. మండలంలో గత ప్రభుత్వ హయంలో కేవలం 3,750 పింఛన్లు ఉండగా మూడేళ్లల్లో ప్రస్తుతం 7,280 పింఛన్లు ఉన్నాయని, న్యూయర్ కానుకగా 252 పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛను సొమ్ము అందిచడం ద్వారా లబ్ధిదారుల సంఖ్య రెట్టింపయ్యిందని వివరించారు. అర్హత ఉంటే చాలు పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. నాడు పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగాల్సి వచ్చేదని. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామున వలంటీర్ ఇంటి తలుపు కొట్టి పింఛన్ అందిస్తున్నారని గుర్తు చేశారు. పింఛన్లపై టీడీపీ నాయకులు చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.





కోసిగిలో లబ్ధిదారురాలు బజారమ్మకు పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న, కందుకూరులో బాలుడికి పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత బెట్టన గౌడ

ఆదోని వెళ్లి పింఛన్ పంపిణీ

పెద్దకడబూరు: ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చేరి చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కురువ చిన్న అల్లన్నకు జగనన్న పింఛన్ తోడయ్యింది. మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన కురువ చిన్న అల్లన్నకు గత మూడు రోజులుగా అనారోగ్యానికి గురయ్యారు. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ వీరేష్ సోమవారం ఆదోనికి వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ సొమ్ము అందజేశాడు. దీంతో ఆయన ఆనందానికి అవధుల్లేకుండా పోయా యి. ఆస్పత్రికే పింఛను తెచ్చి ఇచ్చిన వలంటీర్‌తో పాటు, ఈ వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని 33వ వార్డు కాజీపురలో సోమవారం వార్డు కౌన్సిలర్ గట్టు ఇంతియాజ్ లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న మరోసారి పింఛను సొమ్ము రూ.250 పెంచి లబ్ధిదారులకు రూ.2750 చొప్పున అందజేయడం జరిగిందన్నారు. సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు అబ్బాస్‌అలీ, ఎస్.జహారాబీ, వలంటీర్లు వశీం, అక్రమ్, తాహెర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురువ చిన్న అల్లన్నకు పింఛన్ అందజేస్తున్న వీరేష్



ఆదోని 33వ వార్డు కాజీపురలో పింఛను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ గట్టు ఇంతియాజ్

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించండి

- స్పందన అర్జీలను ఏ ఒక్కటీ తిరస్కరించొద్దు
- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధిత సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరం చూపాలని ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని..

- మండల కేంద్రానికి చెందిన ఈరన్న సర్వే నంబర్ 1093లో విస్తీర్ణం 8.33 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ద్వారా సంక్రమించినదని, దీనికి సంబంధించి అడంగళ్, ఆర్ఓఆర్, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- మండగిరి గ్రామ పంచాయతీకి చెందిన కమ్మ జయమ్మ సర్వే నంబర్ 328/ఏ నందు 0.50 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారు.
- ఎమ్మిగనూరుకు చెందిన మహ్మద్ అలీ సర్వేనంబర్ 19లో 6.3 ఎకరాల భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం కోసం అర్జీ సమర్పించాడు.
- ఇంటి స్థలం కోసం కౌతాళం మండలం గుడికంబాలి గ్రామానికి చెందిన సుమంగళి అర్జీ ఇచ్చారు.
- కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య,



స్పందన కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, వ్యవసాయశాఖ ఏడీ గిరీష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయరాంరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, సీనియర్ సహాయకులు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త ఆదేశాలు అమలు చేయాలి

ఆదోని అర్బన్: స్థానిక గొర్రెల మార్కెట్ విషయంలో లోకాయుక్త ఆదేశాలు అమలు చేయాలని బీజేపీ నాయకులు డివిజన్ సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మహాదేవ్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిస్వామిలు మాట్లాడుతూ ఆదోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం స్థానిక బొబ్బలమ్మ దేవాలయం వద్ద గల నాలుగు రోడ్ల కూడలిలో ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా నిర్వహిస్తున్న గొర్రెల మార్కెట్‌ను లోకాయుక్త ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు రోడ్డులోని డంపు యార్డు వద్దకు మార్చాలన్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉరుకుందుగౌడ్, పట్టణాధ్యక్షుడు విజయ్‌కుమార్, బీజేవైఎం జిల్లా నాయకులు సంజయ్‌పాండే, బాలాజీ, రాము, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం
- 450 గడపలను సందర్శించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆదోని పట్టణంలోని దేవినగర్, పర్వతాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ వార్డు సమస్యలను తెలుసుకుంటూ మంచినీటి వసతి, మురుగు కాలువలు, వీధి దీపాలు, రోడ్లు, కల్వర్టులు, అలాగే నవరత్నాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 450 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందని, రైతులకు పంట నష్టపరిహారం, నాయీబ్రాహ్మణులకు, రజకులకు చేయూత, ఆసరా, విద్యాదీవెన, అవ్వాతాతలకు రూ.2,750 పింఛన్ అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు. సీఎం వైఎస్ జగన్ అవినీతి రహిత పాలన అందిస్తూ మూడున్నరేళ్లలో ప్రజల వద్దకు పాలన చేరువ చేసి దేశంలోని ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచాడన్నారు. వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణాధ్యక్షుడు బి.దేవా, రాజేంద్రప్రసాద్, మహేష్, ప్రసాద్, కౌన్సిలర్ వరలక్ష్మి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, స్టేట్ డైరెక్టర్ రేణుక మంజుల, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఏఈ మదన్ తదితరులు పాల్గొన్నారు.



పర్వతాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

కౌతాళం: గ్రామంలో నెలకొన్న సమస్యలను అందరి సహకారంతో పరిష్కరిస్తామని సర్పంచ్ పాల్‌దినకర్ అన్నారు. సోమవారం కౌతాళం మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బందితో సచివాలయం-1 వద్ద గ్రామ సభ నిర్వహించారు. వివిధ కాలనీల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి పూనుకుంటామని సర్పంచ్ తెలిపారు. సమస్యలను ప్రధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ఎలాంటి సమస్యలు ఉన్న పంచాయతీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్టీఆర్ నగర్‌లో గ్రావెల్ వేయాలని ఆ కాలనీ వాసులు కోరారు. పెరుగుతున్న గ్రామ జనభా దృష్ట్యా తాగునీరు రోజువిడిచి రోజు సరఫరా చేయడానికి మరో మూడు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణానికి 1.70 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఇవి మంజూరైతే గ్రామానికి తాగునీరు పుష్కలంగా వస్తుందన్నారు. వీఆర్ఓ ఆదెప్ప, ఉప సర్పంచ్ తిక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంకు చేరిన సైకిల్ యాత్ర



సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్యులు

మంత్రాలయం రూరల్: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన గుర్రం చైతన్య చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం మంత్రాలయంకు చేరుకుంది. గుర్రం నరసింహులు, అంజిని దేవి దంపతుల ద్వితీయ కుమారుడు చైతన్య గత డిసెంబర్‌లో స్వగ్రామం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించారు. యాత్ర ఏపీతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు 24 రాష్ట్రాల్లో దాదాపు 5 వేల కిలోమీటర్లు సాగనుంది. యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి మంత్రాలయంకు చేరుకున్న చైతన్యకు స్థానిక ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు నారాయణ శెట్టి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ శెట్టి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం ఉదయం చైతన్య ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందానంకు, వైకుంఠ ఏకదాశి సందర్భంగా పాతవూరులో వెలసిన శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులను కలిసి ఆశీర్వాదం పొందారు. మంత్రాలయం సర్పంచ్ తెల్లంబండ్ల భీమయ్య చైతన్యను అభినందించారు. ఆర్యవైశ్యులంతా కలిసి మాధవరం రహదారిలోని కొండాపురం ఆంజనేయ స్వామి ఆలయం వరకు బైకు యాత్ర చేపట్టి వీడ్కోలు పలికారు. ఆర్యవైశ్య పెద్దలు దామోదర్‌గుప్తా, ప్రహ్లాద, రమేష్, లక్ష్మయ్య, కందుకూరు బసవరాజు, నారాయణ తదితరులు ఉన్నారు.

పాఠశాలలోనే ఆధార్ సేవలు

కోసిగి: పాఠశాలలోనే విద్యార్థుల ఆధార్ కార్డు అప్‌డేట్ చేసేందుకు అనుమతులు లభించినట్లు బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంఠ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మంజుభార్గవి 6వ తరగతి విద్యార్థులకు ఆధార్ కార్డు సీడింగ్ అప్‌డేట్ చేశారు. దీంతో విదార్థులు ఆధార్ సెంటర్ల వెంట రోజుల తరబడి తిరగకుండా వ్యయప్రయాసలు తప్పాయి. ఇకపై ఆధార్‌కార్డులో విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లు, విద్యార్థుల పేర్లు, తప్పిదాలు లేకుండా పాఠశాలలోనే మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. వారంలో రెండు రోజుల పాటు పాఠశాలలకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని విద్యార్థుల ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసి కొత్త కార్డు మంజూరు చేస్తున్నట్లు డిజిటల్ అసిస్టెంట్ తెలిపారు.



కోసిగి బాలికల పాఠశాలలో ఆధార్ సీడింగ్ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మంజుభార్గవి

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని అర్బన్: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ డివిజన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం ఎంఈఓ శివరాములు, ఎస్టీయూ సీనియర్ నాయకులు, హెచ్‌ఎం వెంకటస్వామి చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. క్యాలెండర్, డైరీ ఉపయోగాన్ని తెలియజేశారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, రాష్ట్ర పురపాలక కమిటీ సభ్యులు రమేష్‌నాయుడు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీరచంద్రయాదవ్, జిల్లా నాయకులు లోక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

కౌతాళం: గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం మండలానికి ఐదు పనులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మదిర గ్రామానికి 3 పనులు, పొదలకుంట గ్రామానికి 2 పనులు మంజూరైనట్లు తెలిపారు. ఈ ఐదు పనులకు గాను రూ.20 లక్షల నిధులు విడుదలయ్యాయని ఈ రెండు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజి నిర్మాణానికి ఈ నిధుల్ని ఉపయోగించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో మండలానికి 13 పనులు మంజూరు కాగా వీటిని ఇప్పటికే ప్రారంభించామని ఈ ఐదు పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

తుగ్గలి: రెండు రోజుల క్రితం నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో తుగ్గలి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చందునాయక్ సోమవారం తెలిపారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు మానస, నవీన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నూతన సంవత్సర సంబరాలు

ఆదోని రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధను జూనియర్ న్యాయవాదులు సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో బాగా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో హుసేన్‌సాని, కళ్యాణ్‌రెడ్డి, విశ్వనాథ్, నరేష్, మస్తాన్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం ఆదోని బార్ ప్రెసిడెంట్ ఆర్.మల్లికార్జునను కలిసి జూనియర్ న్యాయవాదులకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జూనియర్ న్యాయవాదులు

ఆదోని అర్బన్: ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను సోమవారం ఆర్డీఓ శివారెడ్డి, ఎంఈఐ సిసిరాదీప్తి, ఏఎంవీఐ సుధాకర్‌రెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీఓ గీతావాణి, అగ్రికల్చర్ ఏఓ పాపిరెడ్డి, ఎంఈఓ శివరాములు, ఈఓపీఆర్‌డీ జనార్ధన్ తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నిశాఖల అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజల మెప్పు పొందాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



ఆదోని బావాజీ మఠంలో పూజలందుకున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారు



మంత్రాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌతాళం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో ఆలంకరించారు. వైకుంఠ ఏకాదశి కావడంతో ఉత్తర ద్వారం ద్వారా భక్తుల్ని దర్శనానికి వదిలారు. దేవాలయంలో స్వామివారి పల్లకీ మహోత్సవం నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉత్తర ద్వారం వద్ద ఉంచారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. చాల మంది భక్తులు ఉత్తర ముఖ ద్వారం గేటు వద్ద పూజలు చేసుకోవడం కనిపించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయడంతో ఇబ్బందులు తప్పాయి.

ఆదోని రూరల్: నియోజకవర్గంలో వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) వేడుకలు ఆయా దేవాలయాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. మండగిరి పంచాయతీలో ఉన్న తిరుమలనగర్‌లో వెలిసిన వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు స్వామివారి నైవేద్యం, అల్పాహారాన్ని పంపిణీ చేశారు.



ఆదోనిలో భక్తులతో కిటకిటలాడిన తిరుమలనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం



ఉరుకుంద ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద స్వామివారి పల్లకీని ఉంచి భక్తులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల వెనక ఉన్న బావాజీ మఠంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అన్నమయ్య కీర్తనలు, వైకుంఠ ఏకాదశి విశిష్టత ప్రవచనాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. సంగీత కచేరీ కళాకారులు, ఆలయ అర్చకులు మిశ్రా చక్రవర్తి, దేశాయ బాలాజీ, రామచంద్ర, శంకరశాస్త్రి పాల్గొన్నారు.